రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



రోటోవేటర్లను అందజేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. తొమ్మిది మంది మహిళా రైతులకు సబ్సిడీపై మంజూరైన రోటోవేటర్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు తమ ఉత్పత్తులను దళారులకు కాకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఏడీఏ బాబునాయక్, మండల వ్యవసాయాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఆయా ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి శనివారం ఆయా పాఠశాలల్లో చిత్ర లేఖనం, పద్యాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. అంతేకాక యోగ, కథల పుస్తకాలు, సైన్స్‌కు సంబంధించిన బోధనా పరికరాలతో విద్యార్థులకు ఆటపాటతో శిక్షణ అందిస్తున్నారు.



చిత్రీకరించిన బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

హెచ్‌ఎం సస్పెన్షన్

హుస్నాబాద్‌రూరల్: విధులను నిర్లక్ష్యం చేసినందుకుగాను మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణుకుమార్‌ను వరంగల్ ఆర్‌జేడీ సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ మనీల శనివారం తెలిపారు. విధులకు హాజరుకాకుండా హాజరు వేసుకొన్నారని, విద్యార్థుల చేత సొంత పనులు చేయించుకొన్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. 63 ఇళ్లకు ప్రతిపాదనలు వచ్చాయని ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. సంబంధిత లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించామని చెప్పారు. ఆయన వెంట కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి తదితరులున్నారు

సీసీ రోడ్డు ప్రారంభం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మెట్‌పల్లి మధిర సలెంద్రి శివాలయం వద్ద సీసీ రోడ్డు పనులకు శనివారం భూమిపూజ చేశారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహాచారి కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు పంపిణీ

తొగుట(దుబ్బాక): సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం కృషి చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ భిక్షపతి అన్నారు. మండలంలోని లింగాపూర్‌కు చెందిన రామొల్ల రామవ్వ కుటుంబానికి మంజూరైన రూ.60 వేలు సహాయనిధి చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి ప్రియాంక బదిలీ

గజ్వేల్‌రూరల్: అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక సికింద్రాబాద్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించి ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పండరి మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు గజ్వేల్ ప్రాంత ప్రజలతో ప్రియాంక మమేకమయ్యారన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సుల్లో పాల్గొని విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారని ప్రశంసించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు(గజ్వేల్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మరమ్మతుల కారణంగా మండలంలోని బస్వాపూర్ ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పరిశ్రమలకు, సింగన్నగూడ, శ్రీరాంపూర్, బస్వాపూర్ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్, ప్రైవేట్ హాస్పిటల్ ఏరియా, శ్రీనగర్ కాలనీ, శివాజీనగర్, కుషాల్‌నగర్, ఎల్‌ఐసీ కాలనీ, ఆదర్శనగర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియ నగర్, మార్కెట్ యార్డు, సాజిద్‌పుర, అంబేడ్కర్‌నగర్, శంకర్‌నగర్, సంజీవ్‌నగర్, వీవీ నగర్, పటేల్‌పుర, మహాశక్తినగర్, వెంకటరమణ ఐటీఐ, దక్కల్ కాలనీ, భారత్‌నగర్, హనుమాన్‌నగర్, తహసీల్దార్ కార్యాలయం, మైత్రివనం ప్రాంతాలలో ఆదివారం ఉదయం 7 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కళాకారుడు శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ సర్టిఫికేట్‌తో కళాకారుడు శ్రీనివాస్

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు తిగుల్ శ్రీనివాస్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఇటీవల డాక్టరేట్ అందించారు. మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన పన్నీరు శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఓ కళాకారుడిగా ప్రజలను చైతన్యవంతం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక సారథిలో కళాకారుడి పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సొంతగా పాటలు రాస్తూ రికార్డు చేస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడతూ తన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బెజ్జంకి(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికులకు వేతన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సహాయ కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఆకలి తీర్చే కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రూపేశ్, సూరవ్వ, నర్సవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్

గజ్వేల్‌రూరల్: అపరిచితులను నమ్మి మోసపోవద్దని షీ టీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు సూచించారు. మండల పరిధిలోని పిడిచెడ్‌లో షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేసినా, వేధించినా వెంటనే 100 లేదా సిద్దిపేట కమిషనరేట్ షీ టీమ్ 87126 67434 నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది లావణ్య, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మికుల పని గంటలు పెంచి వారి హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, బాలమోహన్, అంజయ్య, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ముస్తాబైన నూతన ఎల్లమ్మ ఆలయం

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28న గణపతి పూజ, పుణ్యా వచనం, ధ్వజారోహణం, జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ, మండప ఆరాధన,దేవత అర్చన, గణపతి పూజ, 29న ఆవాహిక దేవతల అర్చన స్థాపిత దేవతల ప్రతిష్ఠ హవనములు, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, 30న రోహిణి నక్షత్ర యుక్త మిధున లగ్నముంలో యంత్ర ప్రతిష్ఠ, క్షేత్రపాలక బలి, పూర్ణహుతి, అమ్మ వారి కల్యాణోత్సవం, 1న లందజోగు, గంగ బోనం, సాయంత్రం బోనాల ఘటం, 2న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.